పోటాపోటీగా ఎన్నికల ప్రచారం

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం పోటాపోటీగా సాగుతోంది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం జరిగిన అభివృద్ధి మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే జరగనున్న అభివృద్ధిపై ప్రజలకు ఆయా పార్టీల నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు ప్రచారంలో సరికొత్తగా తమ ప్రచారాన్ని కొనసాగిస్తూ ఓటర్లను ఆకట్టునే ప్రయత్నం చేస్తున్నారు.

- ముషీరాబాద్, అంబర్‌పేట

అంబర్‌పేటలో బీజేపీ విజయాన్ని అడ్డుకోలేరు

బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్

కాచిగూడ: అంబర్‌పేటలో ఈసారి బీజేపీ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదని ఆ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ లింగంపల్లిలోని శ్రీ వినాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. బర్కత్‌పురా, లింగంపల్లి, చెప్పల్‌బజార్, కుత్‌బిగూడ, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి కృష్ణయాదవ్ పాదయాత్ర నిర్వహించారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి

అంజన్‌కుమార్ యాదవ్



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చి రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు.

గాంధీనగర్ డివిజన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించి గడప గడపకూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు హామీల పథకాలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అంజజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ఓటర్లను అభ్యర్థించారు. సోనియాగాంధీ ఆలోచనలకు అనుగుణంగాఏ కాంగ్రెస్ కల్యాణలక్ష్మి ఒక లక్షతోపాటు తులం బంగారం కానుకగా ఇస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో గ్యాస్ సిలిండర్ 500లకే ఇస్తున్నామని తెలంగాణలోను ఇస్తామని అంజన్‌కమార్‌యాదవ్ తెలిపారు. కేసీఆర్ 400కే ఇస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, చంద్రకళ, ఎ బ్లాక్ మాజీ వర్కింగ్ అధ్యక్షుడు వై.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌ను భారీ గజమాలతో కార్యకర్తలు, నాయకులు సన్మానించారు.

రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: తెలంగాణను అభివృద్ధిలో దేశంలో అగ్రభాగాన నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించి కేసీఆర్ నేతృత్వంలో పాలనా పగ్గాలు చేపట్టబోతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో ×వ్యక్తిత్వ వికాసం–నాయకత్వ లక్షణాలు₹ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... పేద ప్రజల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. రెండవసారి అంబర్‌పేటలో అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపొందే విధంగా కార్యకర్తలు క్రమశిక్షణగల సైనికుల వలే పోలింగ్ బూత్ స్థాయిలో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్ రావు మాట్లాడుతూ కార్యకర్తలు ఓటర్ల వద్దకు వెళ్లినప్పుడే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విజయం సాధిస్తారని అన్నారు. బీఆర్ఎస్ అంబర్‌పేట ఎన్నికల ఇన్‌చార్జ్ గండ్ర మోహన్‌రావు, పార్టీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, కార్పొరేటర్లు బి.పద్మవెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, బి.వెంకట్‌రెడ్డి, పార్టీ నేతలు పులిజాల గెల్వయ్య, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జి, సునిల్ బిడ్లాన్, పెంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి.. అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి



నెహ్రూనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే.. ఈ ప్రాంతం అభివృద్ధికి పాటు పడతానని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి స్థానిక ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గోల్నాక డివిజన్ నెహ్రూనగర్, సుందర్‌నగర్, హడ్డి కార్ఖాన, సిబిబి క్వార్టర్స్, శాస్త్రీనగర్, శ్యామ్‌నగర్, నింబోలిఅడ్డ, టక్కీజైల్, ఎంసీహెచ్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో కూడిన కరపత్రాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సారి కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

టీడీపీకి రాష్ట్ర అధికార ప్రతినిధి రాజీనామా



నల్లకుంట: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల్లో పోటీ చేయక పోవడాన్ని తట్టుకోలేక బాధతో తన పదవులకు రాజీనామా చేస్తున్నానని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అంబర్‌పేట నియోజకవర్గం ఇంచార్జ్ బిల్డర్ ప్రవీణ్ ప్రకటించారు. సోమవారం సాయంత్రం నల్లకుంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో కష్టపడి నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్నానని చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణలో ఎన్నికల్లో పోటీచేయబోమని ప్రకటించడం బాధాకరమన్నారు. దీన్ని తట్టుకోలేకనే పార్టీ పదవులకు రాజీనాయ చేస్తున్నానని పేర్కొన్నారు. తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవరెడ్డి నివాసానికి ముఠా గోపాల్



ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వాసుదేవరెడ్డి నివాసానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం వెళ్లారు. అడిగ్‌మెట్ డివిజన్ బాలాజీనగర్‌లోని ఆయన నివాసంలో సుమారు గంటపాటు వాసుదేవరెడ్డితో భేటీ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీలో చేరి తన విజయానికి కృషి చేయాలని కోరారు. వాసుదేవరెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, వీఎస్‌టీ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా కొన్ని సంవత్సరాల పాటు పని చేసిన ఎస్.బి.మోహన్ రెడ్డి కుమారుడు. రెండు, మూడు రోజుల తర్వాత అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అస్లాం, వెంకట్రామిరెడ్డి, శ్యాంసుందర్, కె.మాధవ్, బి.శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, బొట్టు శ్రీనివాస్, సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలుకు ముహూర్తం ఖరారు



ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్



బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



బీజేపీ అభ్యర్థి పూస రాజు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్‌లను దాఖలు చేసుకునేందుకు ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు. 3వ తేదీ నుంచి నామినేషన్‌లకు అవకాశం కల్పించిన ప్పటికీ ఐదు రోజులు గడిచినా కేవలం ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థులు మాత్రమే తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మంచి ముహూర్తాలు ఉంటంతో నామినేషన్‌లకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- 8వ తేదీన ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి దేవాలయం నుండి రాంనగర్ చౌరస్తా ముషీరాబాద్ మీదుగా లోయర్ ట్యాంక్ బండ్ లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.
- 9వ తేదీన ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ తమ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఏ దేవాలయం నుంచి ర్యాలీ ప్రారంభిస్తారో ఇంకా నిర్ణయం తీసుకోలేదు.
- 9వ తేదీన ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజు తమ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ముషీరాబాద్‌లోని శివాలయం, మహంకాళీ దేవాలయంలో పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా ఎన్నికల రిటర్నింగ్ అధకిఆరి కార్యాలయానికి వెళతారు.
- 9వ తేదీన సీపీఎం అభ్యర్థి ఎం.దశరథ్ తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. కల్పన దియేటర్ నుండి దోమలగూడలోని బండమైసమ్మ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నామినేషన్ దాఖలు చేస్తారు.

ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలుకు మోదీ సర్కారు చర్యలు



మాట్లాడుతున్న సంధ్య

పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని నూరేళ్ల ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు జరిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ మరింత వేగవంతంగా చర్యలు తీసుకుంటోందని పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య విమర్శించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా ట్రాన్స్‌జెండర్ సంఘాల కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టే బుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తుందని అన్నారు. ఇప్పుడు జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు జెండర్ పరమైన విధాన అంశాలు, శ్రామిక, మహిళా, ట్రాన్స్‌జెండర్ సమస్యలను తమ మానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. మనువాద తిరోగమన సిద్ధాంతాల వల్ల ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను కొల్పోయే దుస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్యాచరణ వేదిక నాయకులు మీరా, సిస్టర్ లిజి, ఉషా, సజయ, అనురాధ, కొండవీటి సత్యవతి, అంబిక తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మళ్లించి ఖరీదైన సెల్‌ఫోన్‌లు చోరీ

చిక్కడపల్లి: దృష్టి మళ్లించి ఖరీదైన సెల్‌ఫోన్‌లను ఆగంతకులు చోరీ చేశారు. బాధితుడు లక్ష్మణ్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. చిక్కడపల్లికి చెందిన ప్రయివేట్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ లక్ష్మణ్ ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జవహర్‌నగర్‌లోని సురభి కర్రీ పాయింట్‌లో కర్రీ కొనుక్కోవడానికి వెళ్లాడు.

ఆ సమయంలో ముగ్గురు వ్యక్తుల ముఠా అక్కడకు చేరుకుని రూ. 20 నోటును కింద పడేశారు. లక్ష్మణ్‌తో మీ డబ్బులు పడిపోయాయని చెప్పడంతో కిందకు దిగిన లక్ష్మణ్ కిందకు వంగాడు. ఈ మాటాలు మాట్లాడుతూ కిందకు వంగుతున్న క్రమంలోనే లక్ష్మణ్‌కు చెందిన రూ. 44 వేల విలువైన ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఆగంతకులు చోరీ చేసి క్షణాల్లో సినీఫక్కీలో మాయమయ్యారు. బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఆదివారం రాత్రి దేవి 70 ఎంఎం థియేటర్‌లో నటుడు చిరంజీవి నటించిన శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమా చూడ్డానికి వెళ్లిన కేపీహెచ్‌బీకీ చెందిన ప్రైవేట్ ఉద్యోగి రూపేష్ చంద్ర ఖరీదైన సెల్‌పోన్ చోరులు కొట్టేశారు. బాగ్‌లింగంపల్లి దగ్గర బాలాజీ కర్రీ పాయింట్ వద్ద కూడా రూ. 20 పడేసి ఓ వ్యక్తికి సంబంధించిన ఖరీదైన సెల్‌పోన్ ఆగంతకులు చోరీ చేసినట్లు సమాచారం. ఈ కేసును పోలీసులు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు చిక్కడపల్లి ఇన్‌చార్జీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కాచిగూడ: 2022–23వ విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సుల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన మున్నూరుకాపు విద్యార్థినీవిద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. సోమవారం కాచిగూడలోని మున్నూరు కాపు ట్రస్ట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో అందజేయాలని సూచించారు. వివరాలకు ఫోన్స్: 040 2465 8160, 94916 27404లలో సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ సమాచారం మేరకు... జామై ఉస్మానియా–విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని మహిళ(50) రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలరత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించుకుని నిర్వహించే బాలల దినోత్సవ సంబురాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన బాల కలాకారులకు బాలరత్న అవార్డులు ఇవ్వనున్నట్లు లలిత కళాభారతి నిర్వాహకులు కమలాకర భారతీ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీ భావాలున్న చిన్నారులు తమ బయోడేటాను 3–10–6 శ్రీ లక్ష్మి రెసిడెన్సీ, గోఖలేనగర్, రామంతాపూర్, హైదరాబాద్–500013 చిరునామాకు ఈ నెల 10వ తేదీలోపు పంపాలని కోరారు. వివరాలకు 76759 55208, 81798 94207, 83092 81780 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నామినేషన్ దాఖలు చేయగానే 'ఆన్ లైన్'లో...

కవాడిగూడ: ఎన్నికల్లో నామినేషన్ పత్రాలు సమర్పించే అభ్యర్థుల వివరాలు, అఫిడవిట్‌లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నట్లు ముషీరాబాద్ రిటర్నింగ్ అధికారి వి. లక్ష్మీనారాయణ తెలిపారు. నామినేషన్ పత్రాలను 24గంటల్లో పత్రాలను పరిశీలించిన వెంటనే పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల పూర్తి సమాచారం 'నో యువర్ క్యాండిడేట్స్' ఈ యాప్‌లో ఎవరైనా చూడవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

చిక్కడపల్లి: భారతీయ సంస్కృతిలో కుటుంబ వ్యవస్థకు ప్రధాన్యముందని బచ్‌పన్ ప్లే స్కూల్స్ డైరెక్టర్ రూపారెడ్డి అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతున్న తరుణంలో కుటుంబ పెద్దలతో పిల్లలకు ఆత్మీయత అనుబంధాల విలువ తెలియజేసేందుకు డివిజన్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. తాతయ్య, అమ్మమ్మ నానమ్మల అనుబంధం పిల్లలకు తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడుతాయన్నారు. ఈ సందర్భంగా వారికి ఆటల పోటీలను నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ విజయానికి దోహదం



బీజేపీ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, జైసింహా తదితరులు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నేతలు, యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే బీఆర్ఎస్ పార్టీ విజయానికి దోహద పడుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సోమవారం సాయంత్రం కవాడిగూడ డివిజన్ దోమలగూడ మున్సిపల్ కార్వర్స్ వద్ద డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్.డి సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పానుగంటి ప్రభాకర్ ఆధ్వర్యంలో వినాయక్ నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు చింతల హరీష్‌కుమార్ యాదవ్, మహేష్ నర్సింగరావు, ప్రవీణ్ శంకర్, సురేష్‌గౌడ్, జగన్‌గౌడ్, రాకేష్, శ్రీనివాస్ యాదవ్‌తో పాటు వారి అనుచరులు దాదాపు వంద మంది బీఆర్ఎస్‌లో చేరారు. ముఠా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ.... 10సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని దానికి నిదర్శనమే ఈ చేరికలు అన్నారు. డివిజన్ అధ్యక్షుడు వి. శ్యామ్‌యాదవ్, నాయకులు రాజశేఖర్ గౌడ్, సంతోష్, శివకృష్ణ, వరప్రసాద్, సాయి, వేణు, రాము, మల్లేష్, భీమ్‌రావు, రవియాదవ్, చందర్ పాల్గొన్నారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలి

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియమ్మ రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం రాత్రి బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో అనేక మంది యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన దావునా, నవీన్, శంకర్, ప్రకాష్, కుమార్, బాలు, నందు నాయక్‌లకు పార్టీ కుండువా కప్పి సదారంగా ఆహ్వానించారు. అనంతరం అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిక బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలనే ప్రవేశపెట్టి అమలు చేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, లోకేష్ యాదవ్, అంజీయాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనా యాదవ్, శ్యాం యాదవ్, కాసాని ఆనంద్ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బడుగులకు సామాజిక న్యాయం

చిక్కడపల్లి: బీఎస్పీతోనే బడుగు, బలహీనవర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పోచగారి నరేందర్ అన్నారు. ముషీరాబాద్‌లో బీఎస్పీ బలపర్చిన అభ్యర్థిని గెలపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. గాంధీనగర్ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు సోమవారం సాయంత్రం నరేందర్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... పార్టీ, కాన్షీరామ్, మయావతి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురించి వివరించి బహుజనుల సంక్షేమంకోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు, విశ్వచారి, బండారి శ్రీనివాస్, నందకుమార్, దినకర్, పివై పరమేశ్వర్, విశ్వనాథ్, మహరాజ్, రాజు, బీఎస్పీలో చేరిన యువకులు నవీన్, శశికుమార్, స్వామి, శ్రీను, డి.వినయ్, యశ్వంత్, రాకేష్, నవీన్, వినయ్‌కుమార్, శ్రావణ్, మనోజ్, బంటి, ముంచా శ్రావణ్, సందీప్, సాయికిరణ్, చింటు పరమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపిన కథనం ప్రకారం...దోమలగూడలోని పూల్‌భాగ్ కమ్యూనిటీహాల్ దగ్గర ఫుట్‌పాత్ వద్ద స్థానికులు అటుగా వెళ్తుండంగా 60 నుంచి 65 ఏళ్ల వ్యక్తి పడి చనిపోయి ఉన్నాడని సోమవారం సమాచారం అందించారు. ఆ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఇతను ఇదే ప్రాతంలో బెగ్గర్‌గా జీవిస్తాడని పోలీసులు భావిస్తున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన దీన్‌దయాల్‌నగర్ వాసులు



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ దీన్‌దయాల్ నగర్‌కు చెందిన పలువురు బస్తీవాసులు బీఆర్ఎస్ నేత మూఠా జైసింహ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బస్తీ అధ్యక్షుడు మల్లేష్, అనిల్, బాలరాజ్, నారాయణ, బాల నర్సింహ్మా, నరేష్‌లు చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు మహిళల చేరిక



మహిళలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తిలక్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మాట్లాడారు. తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున గులాబీ పార్టీలో చేరుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు.

నల్లకుంటలో కాలేరుకు మద్దతుగా పలువురి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రదీప్‌రావు

నల్లకుంట: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గోనె ప్రదీప్ రావు ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు మద్దతుగా సోమవారం నల్లకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూనల్లకుంటలోని అపార్ట్‌మెంట్ వాసులను కలిసి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి కాలేరును గెలిపించాలని కోరారు. స్థానిక నేత ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్ అధ్యక్షుడిగా ఎర్రం శేఖర్



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ అంబేద్కర్‌నగర్ అధ్యక్షుడిగా ఎర్రం శేఖర్ వరుసగా రెండోసారి విజయం సాధించారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో శేఖర్ 34 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 545 ఓట్లకు గాను 434 ఓట్లు పోలయ్యాయి. ఎర్రం శేఖర్‌కు 195 ఓట్లు మధుసూదన్‌కు 161 ఓట్లు, మల్లేష్‌కు 71 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు చెల్లలేదు. రెండు సంవత్సరాల పాటు పదవీకాలం ఉంటుంది. ఎన్నికల అధికారులుగా రవికుమార్, సతీష్, కుమార్‌లు వ్యవహరించారు. అంబేద్కర్‌నగర్ బస్తీలో అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందే విధంగా చూడటమే తన ధ్యేయమని శేఖర్ తెలిపారు.